

జాడ లేని చలివేంద్రాలు





ఎండకు నిర్మానుష్యంగా కనిపిస్తున్న పూర్ణామార్కెట్

- గతంలో ఏర్పాటు చేసిన జీవీఎంసీ
- ప్రస్తుతం ఆ ఊసే ఎత్తని వైనం
- అల్లాడుతున్న కూలీలు, రిక్షావుల్లర్లు

జగదాంబ: ఎండా కాలంలో బాటసారులు, వాహన చోదకులు, దప్పికగొన్న వారి దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసే చలివేంద్రాలు ఈ ఏడాది కనిపించడం లేదు. ఏటా జీవీఎంసీ నిధులు వెచ్చించి నగర నలు మూలలా చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేసేది. అయితే కరోనా మహమ్మారి తర్వాత ఎక్కడా చలివేంద్రాలు ఏర్పాటు చేయలేదు.

మండుతున్న ఎండలు..

వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. పనుల మీద బయటికి వెళ్లిన వారు దాహార్తి తీర్చుకునేందుకు చలివేంద్రాలు లేక అల్లాడుతున్నారు. ముఖ్యంగా రిక్షావుల్లర్లు, తోపుడుబళ్ల వాళ్లు, బిచ్చగాళ్లు మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కల్పించే చలివేంద్రాలు లేక నానా అవస్థలు పడుతున్నారు. పూర్ణామార్కెట్‌కు వచ్చే వినియోగదారులు, కూలీలు గుక్కెడు నీళ్ల కోసం వెంపర్లాడుతున్నారు.

దాహార్తి తీర్చుకునేందుకు అవస్థలు..

ఈ సంవత్సరం ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు కూడా చలివేంద్రాల ఏర్పాటుకు పెద్దగా ముందుకు రాకపోవడంతో ఈ ఏడాది పెద్దగా చలివేంద్రాలు ఎక్కడా కనిపించడంలేదు. ముఖ్యంగా పాతనగరంలో గతంలో అయితే అడుగడుక్కీ ఒక చలివేంద్రం ఏర్పాటయ్యేది. అయితే ఈ సంవత్సరం ఆ పరిస్థితి కనిపించక ఎండలోనే కాయకష్టం చేసుకునే వారు, బయటి పనులపై తిరిగే వారు ఇబ్బంది పడుతున్నారు.



కరోనాకు ముందు జీవీఎంసీ ఏర్పాటు చేసిన చలివేంద్రం (ఫైల్)

గొంతెండుతోంది..



గతంలో ఎండా కాలం వస్తే చాలు ఎక్కడ పడితే అక్కడ చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. తాగునీటికి ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు ఎక్కడా అటువంటివి కనిపించడం లేదు. కాయకష్టం చేసుకుని బతికే వాళ్లం డబ్బులు పెట్టి నీళ్లు కొనుక్కోలేకపోతున్నాం.

– సూరిబాబు, కార్మికుడు

జీవీఎంసీ ఏర్పాటు చేయాలి..



ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా జీవీఎంసీ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుగా ఏర్పాటు చేస్తే బాగుండేది. ఇప్పటికే ఏప్రిల్ లోకి వచ్చేశాం. ఎండలు మండిపోతున్నాయి. ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలి.

– గంగాధర్, పూర్ణామార్కెట్

కానరాని స్వచ్ఛంద సంస్థలు..

మేం సరుకులు కొనుగోలు చేసేందుకు ఆనందపురం నుంచి పూర్ణామార్కెట్‌కు వచ్చాం. ఎండలు మండిపోతున్నాయి. ఎక్కడా ఒక్క చలివేంద్రం కూడా లేక తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. కనీసం స్వచ్ఛంద సంస్థలైనా ప్రజల దాహార్తి తీరిస్తే బాగుండును. ఇంత పెద్ద నగరంలో కనీసం గుక్కెడు నీళ్లు కూడా దొరక్కపోవడం బాధాకరం.

– రాజుబాబు, ఆనందపురం

ఎన్నికల సమయంలోనే కనిపిస్తాయి..



ఎన్నికల సమయంలో అడగకుండా చేస్తారు. అవసరం అయినప్పుడు ఎవరూ చేయరు. బయట పని చేసుకునే వారి కోసం ఎప్పట్లాగే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. జీవీఎంసీ, స్వచ్ఛంద సంస్థలు ఇందుకు ముందుకు రావాలి.

– రాజా, ఆటోడ్రైవర్

క్లుప్తంగా

డీసీసీబీలో కారుణ్య నియామకం



అజిత్‌కుమార్‌కు నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో కారుణ్య నియామకం జరిపారు. ఎంబీసీహెచ్‌ఎస్ అజిత్ కుమార్‌కు శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్, బ్యాంకు పర్సన్-ఇన్‌చార్జి మయూర్ అశోక్ డీసీసీబీ ముఖ్య కార్య నిర్వహణాధికారి డీవీఎస్ వర్మ సమక్షంలో నియామకపు ఉత్తర్వులు అందజేశారు. డీసీసీబీ మధురవాడ బ్రాంచ్‌లో మెసెంజర్‌గా పని చేస్తున్న మాదు రాంబాబు అకాల మరణం పొందారు. అతని కుమారుడు ఎంబీసీహెచ్‌ఎస్ అజిత్‌కుమార్‌కు విద్యార్హతలు పరిగణనలోకి తీసుకుని నిబంధనలకు లోబడి ఉద్యోగం ఇవ్వాలని గత నెల 26న జరిగిన బ్యాంకు మహాజన సభలో తీర్మానించారు. ఇప్పుడు బ్యాంకులో 5వ కేటగిరీ ఉద్యోగిగా కారుణ్య నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ డి.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మరబోట్లలో ట్రాన్స్‌పాండర్స్ వినియోగం తప్పనిసరి



మరబోట్లకు అమర్చిన ట్రాన్స్‌పాండర్లను పరిశీలిస్తున్న మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు

మహారాణిపేట: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ప్రభుత్వం మొదటి విడతగా ఫిషింగ్ హార్బర్‌లో మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్లకు 618 ట్రాన్స్‌పాండర్స్ నూరు శాతం సబ్సిడీపై సరఫరా చేసింది. ఈ సందర్భంగా ట్రాన్స్‌పాండర్స్ వినియోగం, పనితనంపై మర పడవల యాజమానులు, డ్రైవర్లతో ఫిషింగ్ హార్బర్‌లో సమావేశం నిర్వహించారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రాన్స్‌పాండర్స్ ఉపయోగించేటప్పుడు వచ్చే బ్యాటరీ సమస్యలు, కమ్యూనికేషన్స్‌కు సంబంధించిన అంశాలపైన అవగాహన కల్పించారు. ట్రాన్స్‌పాండర్స్ వల్ల సముద్రంలో బోటు ఎక్కడ ఉన్నదీ, చేపల లభ్యత, బోటు ప్రమాదంలో ఉన్నప్పుడు సమాచారం తెలయజేయడానికి అవకాశం ఉందని జేడీ అన్నారు. అనంతరం జెట్టీలో మరబోట్లకు బిగించిన ట్రాన్స్‌పాండర్లను పరిశీలించారు. సైంటిస్టులు సునీల్ కుమార్, పలాష్ జోషి, రాఘవేంద్ర పరికరాల వినియోగంపై పలు సూచనలు చేశారు. టెక్నీషియన్లు సత్యనారాయణ, రవికుమార్, ఎస్‌డీవో ఆశాజ్యోతి, అనురాధా (కాకినాడ), ఏపీ మర పడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు, నాయకులు సీహెచ్ వీర్రాజు, ఎస్.నర్సింగరావు, ఎం. బాలాజీ, చిన్న, ఎస్.రాము, విశాఖ, కాకినాడ జిల్లాలకు చెందిన మర పడవల యజమానులు, ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ బాగ్చి

మహారాణిపేట: విశాఖలో నేటి నుంచి బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధమని, ఎవరైనా అలా చేస్తే వారికి కాట్పా 2003 చట్టం కింద జరిమానా విధిస్తారని పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చి తెలిపారు. శుక్రవారం సీపీ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అన్ని పోలీసు స్టేషన్ల అధికారులతో ఆయన మాట్లాడారు. కాలేజీలు, స్కూళ్లకు వంద మీటర్ల దూరంలో పొగాకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుస్టేషన్ల వారీగా తనిఖీలు, సోదాలు నిర్వహించాలన్నారు. పాన్ షాపుల్లో పొగాకు ఉత్పత్తులను పరిశీలించాలన్నారు. అక్కడ అమ్మకాలు జరిగితే జరిమానాలు విధించాలన్నారు. ఈ కార్యక్రమం అనంతరం డీఎంహెచ్ కార్యాలయంలో కూడా సమావేశం జరిగింది. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు కూడా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హారిక, సోషల్ వర్కర్ రేవతి, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన మురుగు

పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



గోవింద్ రోడ్డు ఆర్చి వద్ద నిలిచిపోయిన మురుగునీరు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో మురుగునీరు ప్రవహించే దారి లేక రోడ్డెక్కుతోంది. మురుగు వల్ల దుర్వాసన వ్యాపించి స్థానికులు, వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోవింద్ రోడ్డులో వాటర్ సర్వీసింగ్ కేంద్రానికి సమీపంలో కాలువ మొత్తం పూడికతో నిండిపోవటంతో మురుగునీరు రోడ్డుపైకి చేరింది. రెండేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. ఒక పక్క కంకర రోడ్డుపై పడి ఉండటం, మురుగునీరు ప్రవహించడంతో వాహన చోదకులు జారి పడుతున్నారని, పారిశుధ్య సిబ్బంది కాని, అధికారులు కాని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసి పది రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదంటున్నారు.

ఉత్సాహంగా పైడా కళాశాల వార్షికోత్సవం




విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి



గాగ్రా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దాబాగార్డెన్స్: పైడా కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ప్రేమసమాజం ఆడిటోరియంలో ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, రాజ్ మతాజ్ సీఈవో డాక్టర్ మీనాక్షి అనంతరామ్, మ్యాక్ అసెథిటిక్స్ ఇండియా వ్యవస్థాపక చైర్‌పర్సన్ డాక్టర్ శ్రీవల్లి కొర్రపాటి, సాయి ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్స్ సెక్రటరీ, కరస్పాండెంట్ క్రాంతి సుధా మేకా, పైడా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సరోజ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లడం ద్వారా అత్యున్నత శిఖరాలు చేరుకోవచ్చని సూచించారు. వివేకానందుని తత్వాన్ని అలవరచుకోవాలని, మనలోనే అన్ని శక్తి సామర్థ్యాలు దాగి ఉన్నాయని తెలిపారు. అసాంఘిక శక్తుల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని, అటువంటి విషయంలో ఏ అవసరమొచ్చినా తనను నేరుగా కలవచ్చని చెప్పారు. పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి స్థాయిలో ఉంటే.. ఆ కుటుంబాలు ధృఢంగా ఉంటాయన్నారు. డాక్టర్ మీనాక్షి అనంతరామ్ మాట్లాడుతూ మీ జీవితమే మీకు చక్కని ఉపాధ్యాయుడని, మన జీవితం నుంచే మనం పాఠాలు నేర్చుకుని ముందుకు దూసుకుపోవాలన్నారు. డాక్టర్ శ్రీవల్లి కొర్రపాటి, క్రాంతి సుధా మేక మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేసి, జాగ్రత్తలు చెప్పారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సరోజ్ తన సందేశం విద్యార్థులకు అందజేశారు. ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిదీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దాబాగార్డెన్స్: బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ప్రజా నాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని వారం రోజుల పాటు రాజ్యాంగ పరిరక్షణా వారోత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సీపీఎం కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 5న బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి రోజు నుంచి వారం రోజుల పాటు కళా ప్రదర్శనలు, పాటలు, నృత్యాలు, కోలాటం, తీన్మార్ డప్పులు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. 13 ఉదయం 9 గంటలకు దాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రం వరకు డప్పు కళాకారులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. సినీ నటుడు, నిర్మాత, పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి పాల్గొంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వై. రాజు, నగర అధ్యక్షుడు టి. చిరంజీవి, ఎంవీ ప్రసాదరావు, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు జి. రమణ, ఎస్ఎస్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.


ఎంవీడీ పాఠశాల విద్యార్థులకు ఆంగ్లంలో శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈవో పైడపు నాయుడు

మహారాణిపేట: స్థానిక ఎంవీడీ ఉన్నత పాఠశాలలో మిషన్ ఇంగ్లీష్ ఇన్‌ఫ్లూయన్స్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గత ఆరు నెలలుగా 9వ తరగతి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, స్టోరీ రైటింగ్, వ్యక్తిగత సమాచారం తెలపడం, ఉత్తరాలు రాయడం, చదవడం, ఆంగ్లంలో ప్రశ్నించడం తదితర అంశాలను బోధించారు. ఆ కార్యక్రమం నేటితో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి మండల విద్యా శాఖాధికారి బి.పైడపునాయుడు హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఆంగ్లం నేర్చుకోవడం, దానిని ప్రదర్శించడం బాగుందన్నారు. విద్యార్థులకు బోధించిన ఉపాధ్యాయుడు డాక్టర్ గంటాన మోహనరావును అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో ఈ విధమైన బోధన చక్కటి విషయమన్నారు.

కుష్టు నివారణ కేంద్రంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు

దాబాగార్డెన్స్: పాతనగరంలోని చెంగల్రావుపేట గొడారి గోతుల సమీపంలో గల క్రైస్ట్ చర్చి కార్యదర్శి వెంకటేశ్వరరావు శుక్రవారం ఏవీఎస్ కళాశాల డౌన్ రోడ్డులో గల ప్రేమసమాజం కుష్టు నివారణ కేంద్రంలో అన్నదానం చేసి, పండ్లు పంచిపెట్టారు. ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆల్బర్ట్, చొక్కాకుల రాంబాబు, వాడమదుల రామచంద్రరావు, ఒలిగింటి కిరణ్‌కుమార్, దయ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మవారికి కుంకమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెంలోని సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో మహా కుంకుమాభిషేకం జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని సీతమ్మవారికి కుంకుమతో పూజ చేశారు. ప్రధానార్చకుడు రంపా రామ్మోహన్ శర్మ ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

ఎట్టకేలకు పలక ఏర్పాటు



మూసేసిన మ్యాన్‌హోల్

సాక్షి ఎఫెక్ట్..

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయం మలుపులో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారిందని ఈ నెల 2వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన 'ప్రమాదకరంగా మ్యాన్ హోల్' అనే వార్తకు జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు స్పందించి మ్యాన్ హోల్‌ను సిబ్బందిచే పూర్తిగా మూసేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

బాధితులకు రూ.2.5 లక్షల పరిహారం

విశాఖ సిటీ: రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా ఇద్దరు బాధితులకు రూ.2.5 లక్షల పరిహారం అందజేశారు. ఇటీవల హిట్ అండ్ రన్ ప్రమాదంలో మరణించిన నాగిశెట్టి నూకాలమ్మకు రూ.2 లక్షలు, తీవ్ర గాయాలైన కొట్టన దేవికి రూ.50 వేలు చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 34 మంది బాధితులకు రూ.29 లక్షల పరిహారాన్ని ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అందించినట్లు సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. హిట్ అండ్ రన్ కేసుల బాధితులు సహాయ కేంద్రంలో గానీ, టోల్‌ఫ్రీ నంబర్ 7995095793లో గానీ సంప్రదించాలని సూచించారు.

రామాలయం అభివృద్ధికి వాసుపల్లి విరాళం



ఆలయాభివృద్ధికి ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజువీధిలో గల రామాలయం అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం రూ.10 వేలు అందజేశారు. తన కార్యాలయంలో రామభక్త సేవా సంఘం అధ్యక్షుడు కనకరాజుకు తన సొంత నిధులతో ఈ నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసీతారామ కాశీ విశ్వేశ్వర, షిర్డీ సాయిబాబా మందిర్‌లో ప్రతి ఏటా వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు జరుగుతాయన్నారు. పురాతనమైన ఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తుంటారని, ఆలయ శ్లాబ్ శిథిలావస్థకు చేరడంతో పునర్నిర్మాణానికి సాయం చేసినట్లు తెలిపారు. సంఘం అధ్యక్షుడు వంగలపూడి కనకరాజు మాట్లాడుతూ సహాయ కార్యక్రమాల్లో ముందుండే వాసుపల్లి గణేష్‌కుమార్ విరాళం అందివ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రామ భక్త సేవా సంఘం ప్రతినిధులు, పలు వార్డుల వైఎస్సార్ సీపీ నాయకులు పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, ముత్తాబత్తుల రమేష్, అలపన కనకరెడ్డి, సౌత్ ఆర్టీఐ అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్, సౌత్‌బూత్ కమిటీ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, భీశెట్టి ప్రసాద్, సూర్యనాయుడు, చంద్రమౌళి, అజయ్, వాసుపల్లి రాజు, చేపల రాజు, సాగర్, రామరాజు, దూడ అప్పారావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

పోతుస్వామి కుటుంబానికి అండగా నిలుద్దాం..

ఇటీవల మృతి చెందిన 37వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు నొల్లు పోతురాజు (పోతుస్వామి) కుటుంబానికి అండగా నిలుద్దామని పార్టీ నాయకులకు వాసుపల్లి పిలుపునిచ్చారు. పోతుస్వామి మృతి ఆ కుటుంబానికే కాదు.. పార్టీకి కూడా తీరని లోటని పేర్కొన్నారు. పార్టీతో పాటు మనమంతా ఆ కుటుబానికి బాసటగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ పహారాలో పూర్ణామార్కెట్



పూర్ణామార్కెట్‌లో వ్యాపారులకు అవగాహన కల్పిస్తునన సీఐ జీడీ బాబు

- సీపీ ఆదేశాలతో దుకాణాలు తొలగించిన పోలీసులు
- ఉదయం 6 నుంచే పోలీసుల అదుపులో పూర్ణామార్కెట్
- జంగిడీలు పెట్టించేందుకు టీడీపీ నాయకులు, కాంట్రాక్టర్ల యత్నం



పండావీధిలో పోలీసుల పహారా

జగదాంబ: పూర్ణామార్కెట్‌లో పోలీసులు పహారా నిర్వహించారు. గురువారం సాయంత్రం సీపీ శంఖబ్రత బాగ్చి పూర్ణామార్కెట్‌ను పరిశీలించి రహదారిపై ఆక్రమణలు తొలగించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం ఉదయాన్నే వన్‌టౌన్ సీఐ జీడీ బాబు నేతృత్వంలో పోలీసులు భారీగా పూర్ణామార్కెట్‌కు చేరుకున్నారు. మార్కెట్ నుంచి రామకృష్ణా జంక్షన్, దుర్గాలమ్మ గుడి జంక్షన్, నూనెమిల్లు వీధి, పండావీధి, బొదారా రోడ్డులో దుకాణాలు ఏర్పాటు చేయకుండా పహారా కాశారు. సీఐ జీడీబాబు సాయంత్రం వ్యాపారులతో మాట్లాడారు. రోడ్డుపై ఎటువంటి దుకాణాలు ఉండకూడదని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎవరూ రహదారిపై దుకాణాలు పెట్టి ట్రాఫిక్‌కు, పార్కింగ్‌కు ఇబ్బంది పెట్టకూడదన్నారు. అరటిపండ్ల సందులో కూడా తోపుడు బళ్లు తొలగించారు.

టీడీపీ నాయకుల ప్రయత్నాలు..

పూర్ణామార్కెట్ ఆశీలు పాట కాంట్రాక్టర్లు టీడీపీ చెందిన వ్యక్తి కావడంతో రహదారిపై దుకాణాలు పెట్టించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే అండదండలతో దుకాణాలు పెట్టించారు. అయితే తాజాగా మళ్లీ సీపీ మార్కెట్‌ను పరిశీలించి దుకాణాలు పూర్తిగా తొలగించి మార్కెట్ లోపలికి పంపిచాలని ఆదేశించడంతో పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపు



బహిరంగ సభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

అల్లిపురం: మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విప్లవవీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి మార్చి 23 నుంచి ఏప్రిల్ 14 వరకు దేశవ్యాప్తంగా సీపీఐ వివిధ రూపాల్లో ఆందోళనలకు శ్రీకారం చుట్టిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు తెలిపారు. దీంట్లో భాగంగా ఈ నెల 11న జీవీఎంసీ వద్ద బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు అల్లిపురం సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. కేంద్రంలో మోదీ అధికారం చేపట్టిన నాటి నుంచి దేశం అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. సామాన్యులు జీవించలేని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలేవీ అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కె.సత్యనారాయణ, ఎస్‌కే రెహమాన్, పి.చంద్రశేఖర్, ఎం.మన్మథరావు, ఆర్.శ్రీనివాసరావు, సీఎస్ క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.